
# నెఱజాణ



*దాసాయ భవననాథే*
*బదరీ మపనేతు మాదిశతి*
*హేమంతే హరిణాక్షీ*
*పయసి కుఠారం వినిక్షిపతి*

***భావం:*** యజమాని పనివాడిని రేగు చెట్టు కొట్టెయ్యమని ఆజ్ఞాపించగానే ఇంటి ఇల్లాలు హేమంత కాలంలో గొడ్డలిని నీళ్ళలో పడేసింది.

వివాహమైన కొత్తలో భర్త చెప్పిన మాట భార్య వింటుంది. ఆ తరువాత కొంతకాలం భార్య చెప్పిన మాట భర్త వింటాడు. ఇక మూడవ దశలో వాళ్ళిద్దరి మాటలూ ఊరంతా వింటారని హాస్య రస పూరితమైన నానుడి ఉంది. ఏకాభిప్రాయం కుదరనప్పుడు కొంచెం గట్టిగా మాట్లాడు కోవడం సామాన్యమే. అయితే ఎవరు గట్టిగా చివరవరకూ అరిస్తే వారి మాట నెగ్గుతుందా? చాపకింద నీరులా, నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడంమంచిదా?

ఒక గ్రామంలో విశాలమైన తోటలో ఇల్లుంది. తోటలో అన్నిరకాల చెట్లూ ఉన్నాయి. రేగు చెట్టుకి ముళ్ళుంటాయి. కంటక వృక్షాలు ఇంట్లో ఉండడం మంచిది కాదనీ, వాస్తు శాస్త్రం ఒప్పుకోదనీ ఎవరో చెప్తే విన్న ఇంటి యజమానికి చెట్టు కొట్టించేయాలని అన్పించింది. భార్యకు ససేమిరా ఇష్టం లేదు.

రేగు చెట్లు పూర్వకాలంలో అనైతిక కార్యాలకు ఆలవాలంగా ఉండేవి. ఆమెకు ప్రియుణ్ణి కలవడానికి వీలు పోతుందని అనుకుని ఉండవచ్చు. లేదా రేగుపళ్ళని వడియాలు పెట్టుకుని పుల్లపుల్లగా తియ్యతియ్యగా తిందామనుకుని ఉండవచ్చు. పిల్లలకు సంక్రాంతి నాడు భోగి పళ్ళు పొయ్యాలనుకుని ఉండవచ్చు. ఏ కారణమూ లేకపోయినా పచ్చని చెట్టు కొట్టెయ్యెడ మేమిటనుకోవచ్చు. భర్త అవునంటే కాదనాలనుకునే చండిక కావచ్చు. ఏమైతేనేం ఆమెకు రేగు చెట్టు కొట్టడం ఇష్టంలేదు. కొంతసేపు వాగ్వివాదం జరిగింది. భర్త " ఈవిడను నేను ఒప్పించడమేమిటి? నేను ఈ ఇంటి యజమానిని" అనుకుని పనివాణ్ణి పిలిచి చెట్టు కొట్టెయ్యమన్నాడు. అది హేమంత ఋతువు. చలి దంచేస్తున్నది. ఇల్లాలు చడీ చప్పుడూ లేకుండా గొడ్డలి తీసికెళ్ళి నూతిలో పడేసింది. అంత చలిలో పనివాళ్ళు నూతిలో దిగి గొడ్డలిని తియ్యలేరు. ఈ కాలంలోలా అప్పటికప్పుడు గొడ్డలి కొనుక్కుందుకు లేదు. పురమాయించి చేయించాలి. అంతా అయ్యేసరికి ఏమౌతుందో అప్పుడే చూద్దామనుకుందా నెఱజాణ. ఇటువంటి అతి తెలివి తేటల స్త్రీలు ఈనాడూ ఉన్నారు. పదిమందిలో భర్తకు మల్లెపూలతో పాదపూజలు చేస్తూ ఏకాంతంలో మొట్టికాయలు వేసే పడతులకి కరవు లేదు. మాటా నెగ్గించుకోవచ్చు, మంచివారన్న పేరూ తెచ్చుకోవచ్చు. అయితే ఈ మార్గం అనుసరణీయమా, ఎల్లవేళలా సాధ్యమా, ఎప్పటికైనా బండారం బయట పడుతుందా అన్నది ఆలోచించాలి. మనస్తత్వ శాస్త్రవేత్తలయితే తారాజువ్వ లెగిరే చిటపటల సంసారాల్లోనే దీర్ఘాయువు ఉంటోందని రుజువు చేశారు. కొట్లాడుకుని అంతు తేల్చుకోవడమే మంచిదని వాళ్ళ అభిప్రాయం

******